క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ నిర్వాహకులకు నగదు అందిజేస్తున్న జెడ్పీటీసీ శేఖర్

ఆలూరు రూరల్: ఆలయాల నిర్మాణానికి ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ రూ.45 వేలు విరాళం అందించారు. మండలంలోని పెద్దహోతూరు గ్రామంలోని ఉచ్చీరప్ప తాత గోపురం నిర్మాణానికి రూ.25 వేలు, కురుకుంద గ్రామంలోని వీరన్న స్వామి ఆలయానికి రూ.10 వేలు, ఆలూరు కోట వీధిలోని ఉరుకుంద వీరన్న స్వామి ఆలయానికి రూ.10 వేల చొప్పున ఆలయ కమిటీ నిర్వాహకులకు నగదు అందజేశారు. కో–ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా, ఎంపీటీసీ దేవరాజు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు శ్రీధర్, ఉరుకుందప్ప, రాంగోపాల్, రొక్కప్ప, శ్రీనివాసులు, శేఖర్ ఉన్నారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి



మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ రవీంద్రనాథ్

మద్దికెర: ఉపాధి కూలీలు నిబంధనల మేరకు పనులు చేయాలని ఏపీఓ రవీంద్రనాథ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని బసినేపల్లి, మదనంతపురం గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. మస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి వేతనం పడుతుందన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ

హొళగుంద: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రాధ శనివారం బాధ్యత చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న దాసానాయక్ పదోన్నతిపై అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో.. ఆస్పరి ఎంపీడీఓ కార్యాలయం ఏఓ రాధకు హొళగుంద ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు.

కాలం చెల్లిన కూల్‌డ్రింక్ విక్రయం



పత్తికొండ రూరల్: పత్తికొండ–కర్నూలు రోడ్డులోని ఓ హోటల్‌లో కాలం చెల్లిన కూల్‌డ్రింక్ తాగి ఓ వ్యక్తి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. కూల్ డ్రింక్ తాగిన వెంటనే గొంతులో మంటగా అనిపించడంతో బాటిల్‌పై తేదీని చూశాడు. గడువు తీరిపోయి ఉండటంతో షాపు యజమానిని ప్రశ్నించగా తమకు తేదీపై అవగాహన లేదని, డీలర్ వేసిన సరుకునే విక్రయిస్తున్నామని హోటల్ నిర్వాహకుడు మిగతా స్టాక్‌ను బయట పడేసి చేతులు దులుపుకున్నాడు.


వ్యక్తి అదృశ్యం



రామాంజనేయులు (ఫైల్)

వెల్దుర్తి: స్థానిక రాణి తోటకు చెందిన ఉప్పరి రామాంజనేయులు అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. ఈనెల 14న ఇంటి నుంచి స్నేహితుని వద్ద డబ్బు తీసుకువస్తానని చెప్పి వెళ్లిన రామాంజనేయులు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. రామాంజనేయులు భార్య శ్రీదేవి ఫిర్యాదు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్య



మృతి చెందిన ఈశ్వరమ్మ

చిప్పగిరి: పురుగు మందు తాగి బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నగరడోణ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్నసంజప్ప, తాయమ్మ దంపతుల కుమార్తె ఈశ్వరమ్మ (16) కర్ణాటక రాష్ట్రం బాడిగలో సమీప బంధువుల ఇంట్లో ఉంటోంది. మూడు రోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. శనివారం సాయంత్రం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందింది. కాగా ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

ఎమ్మిగనూరు టౌన్: పాఠశాల పునఃప్రారంభించని రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, శేఖర్, ఉదయ్, ఆఫ్రిద్, సురేష్, రఘు శనివారం పట్టణ ఎస్‌ఐ మస్తాన్ వలికి ఫిర్యాదు చేశారు. దాదాపు 250 మంది విద్యార్థులను చేర్చుకున్నారని, పాఠశాల తెరవకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. కాగా ఇదే విషయమై ఎంఈఓ ఆంజనేయులను వివరణ కోరగా రవీంద్రభారతి పాఠశాల తెరవకపోవడంపై విచారించి డీఈఓకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలకు 'వైఎస్సార్ ఆసరా'

- నియోజకవర్గంలో 32,645 మంది మహిళలకు లబ్ధి
- ఇప్పటివరకు రూ.53.88 కోట్లు మాఫీ
- డ్వాక్రా మహిళల హర్షం

పత్తికొండటౌన్/తుగ్గలి: ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల కష్టాలు తెలుసుకున్నారు. అధికారంలోకి వస్తే అక్కాచెల్లెమ్మలను ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణం మొత్తాన్ని 4 విడతల్లో మాఫీ చేస్తాననీ చెప్పారు.

చెప్పిందే తడవుగా అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న అక్కాచెల్లెమ్మల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. అందులో భాగంగా ఆసరా పథకానికి శ్రీకారం చుట్టి మహిళల ఉపాధి కల్పనకు రుణాలు మంజూరు చేయిస్తోంది. ఆర్థిక సాయం ద్వారా డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది.

నియోజకవర్గంలో ఇలా..

పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లో 3,211 సంఘాల్లోని 32,645 మంది మహిళలు తీసుకున్న రుణం రూ.71.90 కోట్లు. చెప్పిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల్లో రూ.53.88 కోట్లు మాఫీ చేసి డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశారు. దీంతో పొదుపు సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు(ఫైల్)

మండలాల వారీగా వివరాలు ఇలా..

మండలం	పొదుపు సంఘాలు	సభ్యులు	మాఫీ అయిన రుణం (రూ.కోట్లలో
పత్తికొండ	719	6,984	రూ.11.15 కోట్లు
తుగ్గలి	673	6,914	రూ.11.46 కోట్లు
మద్దికెర	554	6,076	రూ.10.78 కోట్లు
కృష్ణగిరి	416	4,091	రూ.5.63 కోట్లు
వెల్దుర్తి	849	8,580	రూ.14.86 కోట్లు
మొత్తం	3,211	32,645	రూ.53.88 కోట్లు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వం ఇస్తున్న సాయంతో స్వయం ఉపాధి యూనిట్లు, చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని తాము ఉపాధి పొందడంతో పాటు, ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా ఎదగాలి. పథకాల అమలుకు ప్రభుత్వపరంగా అన్ని విధాల సంపూర్ణ సహకారం అందిస్తాం. – రాధాకృష్ణ, వైకేపీ ఏపీఎం, తుగ్గలి

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు



ఎన్నికల ముందు పొదుపు రుణాలు నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నారు. నాకు ఏటా రూ.5,490 చొప్పున మూడు విడతల్లో రూ.16 వేలకు పైగా మాఫీ అయింది. స్త్రీనిధి కింద రుణం తీసుకొని గేదెలు కొనుక్కున్నా. పొదుపు మహిళలకు అన్ని విధాలా మేలు జరుగుతోంది.

– భాగ్యమ్మ, డ్వాక్రా మహిళ, జొన్నగిరి

జగనన్నకు రుణపడి ఉంటాం



డ్వాక్రా మహిళలను గతంలో చంద్రబాబు పట్టించుకోలేదు. రుణమాఫీ చేస్తానని చెప్పి మరింత భారంమోపారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణాలు మాఫీ చేసి పొదుపు మహిళలకు అండగా నిలిచారు. ఏటా రూ.9 వేల చొప్పున మూడు విడతల్లో ఇప్పటికే రూ.27 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అన్ని విధాలా మేలు చేసిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– సరోజమ్మ, డ్వాక్రా మహిళ, ముక్కెళ్ల

రేపటి నుంచి రాంపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్ యాదవ్, సచివాలయ కన్వీనర్ నాగభూషణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈగా విజయకుమార్

తుగ్గలి: మండల హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న విజయకుమార్‌ను ఇన్‌చార్జ్ డీఈగా నియమించారు. ఇదివరకు డీఈగా పనిచేసిన గురుప్రసాద్ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తుగ్గలి ఏఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో అందజేస్తున్న విత్తనాల నమోదు ఆర్బీకేలతో పాటు పంచాయతీలు ఉన్న గ్రామాల్లోనూ చేపట్టాలని బొమ్మనపల్లి, ఎడవలి సర్పంచులు ఆంజనేయులు, కల్పనతోపాటు రైతులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఎడవలి, బొమ్మనపల్లి, కొత్తపల్లి, హంప గ్రామాలకు హంపలో రైతు భరోసా కేంద్రం ఉందన్నారు. అక్కడికి వెళ్లాలంటే వ్యయప్రయాస పడాల్సి వస్తోందన్నారు. రైతులు ఇబ్బందులను గమనించి గ్రామాల్లోనే విత్తనాలు పంపిణీ చేయాలన్నారు.



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆలూరు: దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం మంత్రి గుమ్మనూరు జయరాం తన నివాసంలో అల్లంకొండ రాము, దుబ్బయ్య, రంగనాయకులు, ఈదిరింటి రాముడు, వంకాయ కొలుట్లయ్య, మద్దయ్య, కృష్ణ, మునెప్ప తదితర 50 కుటుంబాలను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నారాయణస్వామి, పి.కోటకొండ గ్రామ నాయకులు ఆలంకొండ రామానాయుడు, లక్ష్మణస్వామి, దుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



పదిలో సత్తాచాటిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్ఎస్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లోమొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహక మహుమతులు అందజేశారు. అనంతరం మిగతా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నాడు నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు భారం కాకుండా జగనన్న విద్యా కానుక పేరుతో స్కూల్‌యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్స్‌లు, టైలు స్కూల్‌బ్యాగ్‌లతో పాటు ట్యాబ్‌లు అందజేస్తున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జగనన్న గోరుముద్ద పేరుతో పోషకాహారం అందిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురివాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు, హెచ్ఎం మధుసుదన్‌రాజు, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, అల్లబకాష్ పాల్గొన్నారు.

- పట్టణంలోని వీవర్స్ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరిశీలించిన మున్సిపల్ అధికారులకు సూచనలిచ్చారు. భవన నిర్మాణ పనులను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయిలతో సమావేశమై విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.
- **గోనెగండ్ల:** స్థానిక జెడ్పీ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన జి.సాయి జశ్వంత్‌కు రూ.3 వేలు, కె.వీరసింహుడుకు రూ.2 వేలు, శ్రావణికు రూ.వెయ్యి నగదు బహుమతులను పీఎంసీ చైర్మన్ ఉస్మాన్ అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం పాల్గొన్నారు.
- **నందవరం:** స్థానిక ఎమ్మార్సీలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు ఎంఈఓ సుదర్శన్ రెడ్డి నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ జయన్న, జెడ్పీ స్కూల్ హెచ్ఎం శివరాం పాల్గొన్నారు.
- **వెల్దుర్తి:** స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో హెచ్ఎం కె చంద్రావతి ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాల పంపిణీ జరిగింది. టాపర్లుగా నిలిచిన పల్లవి, భార్గవి, త్రివేణి, కీర్తనలకు సర్పంచ్ చేతుల మీదుగా నగదు బహుమతి అందించారు.

టీ బ్రేక్‌లో మిరప విత్తనాల విక్రయం

- దాడులు నిర్వహించిన వ్యవసాయ అధికారులు



మిరప విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ వెంకట్రాముడు

పత్తికొండ రూరల్: పత్తికొండ–ఆదోని రోడ్డులోని ఓ టీ బ్రేక్ కేఫ్‌లో మిరప విత్తనాలు విక్రయిస్తుండగా శనివారం మండల వ్యవసాయ అధికారి ఏఓ వెంకట్రాముడు, ఏఈఓ రియాజ్‌బాషాషా ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి 9 కిలో ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కర్నూలుకు చెందిన గురుసాంబశివ ట్రేడర్స్ ఆధ్వర్యంలో దుకాణదారులు కొత్త కంపెనీని రైతులకు ప్రమోట్ చేసేందుకు వ్యవసాయ అధికారుల అనుమతి తీసుకుని స్టాల్ వేసి రైతులకు కలిగే లాభనష్టాలను వివరించి, అవగాహన కల్పించి అమ్మకాలు చేపట్టాలి. అయితే ఎలాంటి నిబంధనలు పాటించకుండా విత్తనాలు విక్రయిస్తుండటంతో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నామని వ్యవసాయ అధికారి వెంకట్రాముడు తెలిపారు.

రమణీయం విజయీంద్రతీర్థుల రథోత్సవం



హొళగుంద: స్థానిక కోటవీధిలో వెలిసిన విజయీంద్రతీర్థుల రథోత్సవం శనివారం బ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. విజయీంద్రతీర్థుల మహా ఆరాధనోత్సవం ముగింపులో భాగంగా జరిగిన ఉత్తరాధన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి బ్రాహ్మణులు భారీగా తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

రథోత్సవం నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

సంక్షిప్తం

కౌలు కార్డులతో భూయజమానికి నష్టం లేదు

మద్దికెర: కౌలు కార్డు వల్ల భూ యజమానికి ఎలాంటి నష్టం ఉండదని ఏఓ రవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కౌలురైతు కార్డుపై అవగాహన కల్పించారు. కార్డుల వల్ల కౌలు రైతుకు కేవలం ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు దక్కుతాయన్నారు. భూమిపై హక్కులు మాత్రం యజమానికే ఉంటాయన్నారు. సమావేశంలో వీఆర్వో బాలవర్ధిరాజు, వ్యవసాయాధికారులు ఇంద్రజ, మాధవీలత పాల్గొన్నారు.

- **హాలహర్వి:** మండంలోని విరుపాపురం, బిలేహాల్ రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతుల గుర్తింపు సభలు నిర్వహించారు. వ్యవసాయ అధికారి శివశంకర్ మాట్లాడుతూ గుర్తింపు కార్డులతో పలు ప్రయోజనాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
- **తుగ్గలి:** కౌలు రైతుల గుర్తింపుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి, వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ మాట్లాడారు. ఈనెల 19 నుంచి 23 వరకు ప్రతి సచివాలయ పరిధిలో కౌలు రైతు సదస్సులను నిర్వహించి కౌలు కార్డుల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

చిప్పగిరి: అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ సూచించారు. శనివారం గుమ్మనూరులో జనభాగీదార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఓవర్ హెడ్ ట్యాంకు కూల్చివేత

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును శనివారం ఈఓపీఆర్డీ సంజన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంనీలా, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, వీఆర్‌ఓ మల్లికార్జున, విద్యుత్, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో కూల్చివేశారు. ట్యాంక్ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని 'సాక్షి' ప్రచురించడంతో అధికారులు స్పందించి కూల్చివేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

తాగు నీటి సమస్య పరిష్కారం

చిప్పగిరి: కొంత కాలంగా తాగు నీటి సమస్యతో ఏరూరు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సర్పంచ్ వెంకటలక్ష్మి పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

వానరానికి అంత్యక్రియలు

చిప్పగిరి: వానరానికి అంత్యక్రియలు నిర్వహించి నంచర్ల గ్రామ ప్రజలు మానవత్వం చాటుకున్నారు. వానరం మృతిచెంది ఉండటాన్ని గమనించిన కొందరు.. ఊరేగింపుగా తీసుకెళ్లి శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో వడ దెబ్బ తగిలి మృతి చెంది ఉండవచ్చని గ్రామ పెద్దలు తెలిపారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల హర్షం



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరించి ధన్యవాదాలు తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఎమ్మిగనూరు టౌన్: కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు కాంట్రాక్ట్ లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నాగులదిన్నె కళాశాలలకాంట్రాక్ట్ లెక్చరర్లు కలిసి సత్కరించి సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, మహదేవప్ప, బజారి, రంగస్వామి, ఈశ్వర్, ప్రేమ్‌కుమార్, సరిత, సూర్యకుమారి, పుష్పలత, లలిత, గంగావతి, హరిబాబు, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున స్వామి, వెంకటేషప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- నలుగురికి గాయాలు

ఆలూరు రూరల్: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని కరిడిగుడ్డం గ్రామం సమీపంలో శనివారం సాయంత్రం ప్రమాదం జరిగింది. వివరాలు.. పత్తికొండకు చెందిన ఫక్రుబీ, అచ్చుకట్ల ఖాసీంబీ, గౌస్ బాషా తమ ఆటోలో ఎల్లార్తి షేక్షావలి దర్శనానికి బయలుదేరారు. కల్యాణదుర్గానికి చెందిన షేక్ ఖాసీంబీ, షఫీవుల్లా ఆలూరులో అదే ఆటోలో ఎల్లార్తికి వస్తామని అడగడంతో వారిని ఎక్కించుకున్నారు. కరిడిగుడ్డం గ్రామం సమీపంలో ఆటో అదుపుతప్పి కింద పడడంతో షఫీవుల్లా, ఖాసీంబీలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఫక్రుబీ, ఖాసీంబీకు స్వల్పగాయాలయ్యాయి.

నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 482 ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా 242 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. 117 ఇళ్లు పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ గురుస్వామి ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామ శివారులో ఎల్ఎల్‌సీ కెనాల్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదోనికి చెందిన కె.భాగ్యలక్ష్మి, డి.నరసింహ, మాచనూరుకు చెందిన తిరుమల్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా సోదాలు నిర్వహించి అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 960 (10 బాక్సులు) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ కంపెనీకి చెందిన కర్ణాటక టెట్రా ప్యాకెట్‌లను, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

- **కృష్ణగిరి:** మండల పరిధిలోని సంగాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న హరికృష్ణను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 40 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో శనివారం సోదాలు నిర్వహించామన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి, బాలాపురం గ్రామాలలో స్థానిక పోలీసులతో కలిసి శనివారం జరిపిన సోదాల్లో ఆయా గ్రామాలకు చెందిన సారా విక్రేతలు చిన్న మునిస్వామి, నాగమద్దయ్యలను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

నారాయణరెడ్డికి ఘన నివాళి

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, దివంగత నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డి జయంతి సందర్భంగా శనివారం ఆయన సోదరుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కుమారుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి తదితరులు నారాయణరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం చిన్నారుల చేత కేక్ కట్ చేయించి జోహార్లర్పించారు. నియోజకవర్గంలోని పలువురు నాయకులు, అభిమానులు నారాయణరెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు.



నారాయణరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నవరత్నాల పథకాలతో పేదలు అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 30వ వార్డులోని ఎంఎస్ నగర్‌లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వార్డు ఇన్‌చార్జ్ కె.విశ్వనాథ్ తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన వివరించి బుక్‌లెట్లు అందించారు. సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా పాలన సాగిస్తున్న సీఎంగా వైఎస్ జగన్‌ను మరోసారి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, నాయకులు రియాజ్ అహమ్మద్, నజీర్ అహమ్మద్, పాల శ్రీనివాసరెడ్డి, గట్టు ఖాజ, సోమేష్, రజాక్, రంగన్న, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్ అహమ్మద్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు ఎంకె శివప్రసాద్, డిష్ కేశవరెడ్డి, అమాన్, విశ్వనాథ్‌రమేష్, బజారి, షాబుద్దీన్, పార్టీ వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.